క్లుప్తంగా

నిత్యాన్నదానం అభినందనీయం


వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న బెన్నిబాబు

ధవళేశ్వరం: నిత్యాన్నదానం చేయడం అభినందనీయమని జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ బెన్నిబాబు అన్నారు. స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద నిత్యాన్నదాన దాతలు జి.జయకుమార్, జి.జయప్రద, జి.నాగార్జున, శ్రావ్య ఆధ్వర్యంలో అర్పిష్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. దీనికి స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, సత్య దంపతులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ బెన్నిబాబు పాల్గొని అర్పిష్ జన్మదిన కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, ఆహారం, దుస్తులు పంపిణీ చేశారు. ముత్యాల పోసికుమార్ మాట్లాడుతూ రెండేళ్లుగా నిత్య అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు కేవీఆర్ సాగర్, ముత్యాల సత్య, వృద్ధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

30 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

కడియం: దుళ్లలోని వేంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ భక్త బృందం తెలిపింది. 30 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక పూజలు, వాహన సేవలు ఉంటాయన్నారు. 31న శేషవాహన సేవ, ఫిబ్రవరి 1న గరుడ వాహన సేవ, 2న అన్నకూటోత్సవం, హనుమంత వాహన సేవ, 3న లక్ష్మీహోమం, గజవాహన సేవ, రథోత్సవం, 4న సుదర్శన హోమం, పుష్పక వాహన సేవ, 5న చక్రస్నానం, శ్రీపుష్పయాగం ఉంటాయని వివరించారు.

దోసాలమ్మ వారికి పూజలు


దోసాలమ్మ వారికి పూజలు చేస్తున్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు గ్రామ దేవత దోసాలమ్మ వారి సంక్రాంతి సంబరాలలో భాగంగా బుధవారం అమ్మవారిని, గరగలను మంచంపై దుప్పటి, ధాన్యం, పిండి వంటలు తదితర వస్తువులు పెట్టి పాన్పు వేశారు. అమ్మవారికి సుంకర వెంకట నరసింహమూర్తి, మద్దిపోటి వెంకటరామకృష్ణలు పాన్పులు వేసి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఎవరైనా తమ ఇంటి వద్ద పాన్పు వేయించుకోవాలంటే ఆలయ కమిటీని ఈ నెల 28వ తేదీ వరకూ సంప్రదించవచ్చు.

జగనన్న కాలనీ పరిశీలన

ప్రకాశంనగర్: వెలుగుబందలోని జగనన్న కాలనీని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఇంటి నిర్మాణానికి ఇస్తున్న రూ.1.80 లక్షల సాయం సరిపోవడం లేదని, దానిని రూ.5 లక్షలకు పెంచాలని అన్నారు. సీపీఐ చేపట్టిన పోరుబాట 30 వరకూ కొనసాగుతుందన్నారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

పలువురి పరామర్శ

కడియం: దుళ్లలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ తోకల వీరవెంకట్రావు కుటుంబాన్ని బుధవారం పలువురు పరామర్శించారు. వీరవెంకట్రావు తండ్రి రాధాకృష్ణ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్ తదితరులు పరామర్శించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

కంబాలచెరువు: స్థానిక నాగులచెరువు వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఆదిత్య కిరాణా జనరల్ స్టోర్ వద్ద సుమారు 70 ఏళ్ల వయసున్న వ్యక్తి పడి ఉన్నాడని రెండో పట్టణ పోలీసులకు సమాచారం అందింది. వార్డు రెవెన్యూ సెక్రటరీ ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. ఆచూకీ తెలిసిన వారు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఆహో.. నయనానందనం

- నర్సరీలకు సందర్శకుల తాకిడి
- మొక్కల కొనుగోలుకు వస్తున్న జనం
- జాతీయ రహదారి వెంబడి సందడి


కడియపులంకలోని ఓ నర్సరీలో సందర్శకుల సందడి


నర్సరీలో మొక్కలను కొనుగోలు చేసిన మహిళలు

కడియం: రంగుల రంగుల పువ్వులు.. ఆకట్టుకునే మొక్కలు.. ఆహ్లాదాన్ని పంచే అనేక చెట్లకు నెలవు కడియం ప్రాంత నర్సరీలు. ఈ ప్రాంతంలో నర్సరీలకు రాష్ట్రంలోనే విశేష గుర్తింపు ఉంది. అందుకే ఎక్కడెక్కడి నుంచో వచ్చి మరీ ఇక్కడ మొక్కలు కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం కడియం ప్రాంత నర్సరీలకు సందర్శకుల తాకిడి ఎక్కువైంది. సంక్రాంతి సెలవుల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు వెళ్తారు. ఈ క్రమంలో ఉభయ గోదావరి జిల్లాలకు వచ్చే వారంతా కడియం ప్రాంత నర్సరీలను చూసేందుకు వస్తున్నారు. ఇదే క్రమంలో గత వారం రోజులుగా నర్సరీల్లో సందర్శకుల సందడి పెరిగింది. అలాగే అనేక మొక్కలు ఉండే పెద్ద నర్సరీలను కూడా సందర్శకులు ప్రత్యేకంగా చూసేందుకు వస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సంక్రాంతి, నూతన సంవత్సర మొక్కల కూర్పులను సందర్శించి, కుటుంబ సమేతంగా ఫొటోలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా కడియం మండలం వేమగిరి నుంచి జాతీయ రహదారి వెంబడి పొట్టిలంక వరకూ సుమారు 8 కిలోమీటర్ల మేర ఉన్న నర్సరీల వద్ద జన సందడి కనిపిస్తోంది. ఇక్కడ సుమారు 400 నర్సరీల వరకూ ఉన్నాయి. పూల మొక్కల ధర సుమారు రూ.40 నుంచి రూ.500 వరకూ రకాన్ని బట్టి ఉంటుంది. అటు విజయవాడ, ఇటు విశాఖపట్నంల నుంచి వచ్చే పోయే వారంతా నర్సరీల వద్ద ఆగి మొక్కలను చూసి, కొనుగోలు చేసి వెళుతున్నారని రైతులు చెబుతున్నారు.

కొత్తగా.. కొంగొత్తగా..

ప్రస్తుతం వచ్చే సందర్శకుల కోసం నర్సరీలను రైతులు ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. బెంగళూరు, పూణేతో సహా థాయ్‌లాండ్, మలేషియా, వియత్నాం, జపాన్ వంటి దేశాల నుంచి ఆకట్టుకునే పలు రకాల మొక్కలను దిగుమతి చేసుకున్నారు. వీటికి అదనంగా ప్రస్తుత సీజన్‌లో వచ్చే మొక్కలు ఉన్నాయి. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులను ఈ మొక్కలు ఆకర్షిస్తున్నాయి. మొక్కల ఆకర్షణకు తోడు రైతులు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి నర్సరీలను సుందరంగా తీర్చిదిద్దారు. సంక్రాంతి మొక్కల కూర్పులు మొదలుకుని, కోడి పుంజులు, ప్రత్యేక కుండీలు, ఆకర్షణీయమైన మొక్కల డిజైన్లను నర్సరీల్లో ఏర్పాటు చేశారు.

గతానికంటే తక్కువే..

సంక్రాంతి సెలవుల నేపథ్యంలో సందర్శకుల సందడి పెరిగినప్పటికీ గతంతో పోలిస్తే ఈ ఏడాది తక్కువగానే వచ్చారని వేమగిరి, కడియపులంక గ్రామాలకు చెందిన నర్సరీ రైతులు జి.మణికంఠ, పి.చినసత్యనారాయణ తెలిపారు. సందర్శకుల రద్దీని బట్టి మొక్కల అమ్మకాలు ఉంటాయని, ఈ ఏడాది మందకొడిగా ఉందని వివరించారు. సందర్శకులను ఆకట్టుకునే విధంగా సీజనల్స్ రకాలు ఈ ఏడాది తక్కువగానే ఉన్నాయన్నారు. ఇది కూడా అమ్మకాలు తగ్గడానికి ఒక కారణంగా భావిస్తున్నామని వారు వివరించారు. ఇదిలా ఉండగా సందర్శకుల రాక జనవరి నెల మొత్తం కొనసాగుతుందని పలువురు తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండండి


వసతి గృహంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు: బాలలు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆమె బుధవారం సందర్శించారు. వసతి గృహంలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ప్రత్యూష కుమారి మాట్లాడుతూ అనాలోచితంగా ఏ పనులు చేయవద్దని, ఆవేశంలో చేసిన పనులతో నష్టాలు తప్పవన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారితో పాటు బాధితుల జీవితాలు కూడా దుర్భరమవుతాయన్నారు. మన హక్కులను కాపాడుకోవడంతో పాటు ఇతరుల హక్కులకు భంగం కలగకుండా ఉండటం మన బాధ్యత అన్నారు. ఏ విధమైన న్యాయ సహాయం కావాలన్నా, వసతి గృహంలో ఏ సమస్య ఉన్నా తెలియజేయాలన్నారు. ఎవరికైనా వారి తరఫున వాదించేందుకు న్యాయవాది లేనిపక్షంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నియమిస్తామన్నారు.

సీఎం జగన్‌తో సంక్షేమ స్వరాజ్యం

- రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్


కడియంలో వృద్ధురాలికి పథకాల గురించి వివరిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రానికి సంక్షేమ స్వరాజ్యం వచ్చిందని, పేదలకు పథకాలు చేరువ అయ్యాయని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తెలిపారు. కడియం సచివాలయం–2 పరిధిలో రెండో రోజూ బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మూడున్నరేళ్లుగా సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చందన వివరించారు. అర్హులందరికీ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీ వంటి పలు సమస్యలను స్థానికులు చందన నాగేశ్వర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటికి తగిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను చందన ఆదేశించారు. అర్హత ఉంటే చాలు నేరుగా ఇంటికే సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలే చెప్పడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి పట్టంకట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్, ఎంపీడీఓ కె.రత్నకుమారి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, పార్టీ నాయకులు దండుబోయిన మూర్తి, బట్టు చిన్ని, సాకా పట్టాభి, గుత్తుల వాసు, దొడ్డా బుజ్జి, ఓగిరాల రాజు, పసల నాయుడు, చంద్రకుమార్ పాల్గొన్నారు. తొలుత వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో చందన సమావేశమయ్యారు. గ్రామంలో అమలవుతున్న సంక్షేమ పథకాల తీరును అడిగి తెలుసుకున్నారు.

21, 22 తేదీలలో రెండు రైళ్ల రద్దు

విజయవాడ డివిజన్‌లో ట్రాఫిక్ బ్లాక్ సందర్భంగా మార్పు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ డివిజన్‌లో రైల్వే ట్రాఫిక్ బ్లాక్ కారణంగా కాకినాడ పోర్ట్ – విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే (17267/17268) రైళ్లను ఈ నెల 21, 22 తేదీలలో రద్దు చేశారు. రైల్వే అధికారులు బుధవారం ఈ విషయం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా గుంటూరు – విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే (17239/17240) రైళ్లు 21, 22 తేదీలలో సామర్లకోట – విశాఖపట్నం మధ్య మాత్రమే నడుస్తుందని పేర్కొన్నారు. విజయవాడ – విశాఖపట్నం మధ్య నడిచే (12718/12717) రైళ్లు తుని – విశాఖపట్నం మధ్య నడుస్తాయని తెలిపారు. దీనిని ప్రయాణికులు గమనించాలన్నారు. ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు సికింద్రాబాద్ – విశాఖపట్నం మధ్య (08506) రైలు గురువారం నడవనుందని అధికారులు బుధవారం ప్రకటించారు.

స్వచ్ఛ గోదావరి సాధనకు కృషి


కలెక్టర్ మాధవీలతను కలసిన రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి నూతన కార్యవర్గం

రాజమహేంద్రవరం సిటీ, సీటీఆర్ఐ: స్వచ్ఛ గోదావరి సాధనకు రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి నిరంతరం కృషి చేస్తుందని చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పేపరుమిల్లు రసాయనిక, ఇతర వ్యర్థాలతో కలుషితమవుతున్న పవిత్ర గోదావరిని రక్షించుకునేందుకు సమితిని బలోపేతం చేసేందుకు కార్యవర్గాన్ని విస్తరించే చర్యలు చేపట్టినట్లు బుధవారం ఆయన తెలిపారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ నేతృత్వంలో ఈ కమిటీ నియామకాలు చేపట్టి ముందుకు వెళుతున్నట్లు విశ్వేశ్వరరెడ్డి ప్రకటించారు. ఇటీవల 46 రోజుల పాటు నిరవధిక నిరసన దీక్ష చేపట్టిన సమయంలో ప్రక్షాళనకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ మాధవీలత ప్రభుత్వం తరఫున హామీ ఇవ్వడంతో దీక్షను విరమించానన్నారు. గోదావరి కలుషితం విషయాన్ని ఇటీవల నగరానికి విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లానని వివరించారు. ఇదిలాఉంటే కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బర్రే కొండబాబు, జనరల్ సెక్రటరీగా కానుబోయిన సాగర్, ట్రెజరర్‌గా పినిశెట్టి సుబ్బరాజు, జాయింట్ సెక్రటరీగా కొంచాడ ఈశ్వరరావు, పది మంది కార్యవర్గ సభ్యులను నియమించినట్లు తెలిపారు. అనంతరం కొత్తగా ఏర్పడిన కార్యవర్గం జిల్లా కలెక్టర్ మాధవీలతను కలసింది. గోదావరి పరిరక్షణకు సహకరించాలని కోరింది.

ఫుడ్ ప్లాజా షాపులు తొలగించాలి

సీటీఆర్ఐ: స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అర్బన్ ఫుడ్ ప్లాజా షాపులను తొలగించాలని దళిత గిరిజన సంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ ఫుడ్ ప్లాజా తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందించారు. వీటివల్ల పక్కనే ఉన్న ఎస్సీ, ఎస్టీ ఆడపిల్లల హాస్టల్స్‌లో ఉండి చదువుకొనే అమ్మాయిలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. వారి చదువుకు ఆటంకంగా మారిందన్నారు. దీనిని తొలగించాలని కోరారు. కలెక్టరేట్‌లోని నగరపాలక సంస్థ కమిషనర్‌కు కూడా పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో మర్రి బాజ్జి, కాశీ నవీన్‌కుమార్, తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, సీహెచ్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్యవర్గం ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గ సభ్యులు

ధవళేశ్వరం: స్థానిక ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కొత్తగా ఎన్నికైన సభ్యులతో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోసిన వీరేంద్రకుమార్, దొమ్మేటి రవికుమార్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన అధ్యక్షుడిగా ఎం.చిట్టిబాబు, ఉపాధ్యక్షుడిగా ఎ.ఫణికుమార్, కార్యదర్శిగా టి.నాగేంద్రప్రసాద్, సహ కార్యదర్శిగా ఆర్.నాగు, కోశాధికారిగా పి.రవికుమార్ తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. అసోసియేషన్ నాయకులు కోనె శ్రీను, కేతా శ్రీను, ప్రభాకర్, రాజమహేంద్రవరం, కడియం అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ చిరస్మరణీయుడు


బొమ్మూరులో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్: మాజీ సీఎం ఎన్టీఆర్ చిరస్మరణీయుడని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బొమ్మూరు సెంటర్‌లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పేదలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, నాయకులు మార్ని వాసుదేవరావు, నున్న కృష్ణ, పందూరి అప్పారావు పాల్గొన్నారు. స్థానిక కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే బుచ్చయ్యచౌదరి, పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గన్ని కృష్ణ పూలమాలలు వేశారు.

కడియం మండలంలో..

కడియం: స్థానిక దేవీచౌక్ వద్ద మాజీ సీఎం ఎన్టీఆర్ వర్ధంతిని ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు రఘురామ్, ప్రత్తిపాటి రామారావుచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేమగిరి, దుళ్లలోనూ ఎన్టీఆర్ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల అధ్యక్షుడిగా 'గద్దె'


గద్దె వెంకటకృష్ణ చౌదరి

సీతానగరం: రాజానగరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల అధ్యక్షుడిగా, పార్టీలో చేరికల కమిటీ కన్వీనర్‌గా గద్దె వెంకటకృష్ణ చౌదరి (నల్లి)ని నియమించినట్లు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీతానగరం మండలం వంగలపూడికి చెందిన ఆయన ఎంపికపై సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది. సీతానగరం, రాజానగరం, కోరుకొండ మండలాల్లో 210 బూత్ కమిటీలు ఉన్నాయి. ఈ కమిటీలను పర్యవేక్షిస్తూ పార్టీ అభివృద్ధికి, బలోపేతానికి కృషి చేయాల్సి ఉంది. ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తూ రెండు కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా వెంకటకృష్ణ చౌదరి మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. రెండు కీలక పదవులు అప్పగించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగావకాశాలకు ఎన్‌సీసీ దోహదం


ఎన్‌సీసీ క్యాడెట్లకు రైఫిల్ షూటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజానగరం: భవిష్యత్తులో మంచి ఉద్యోగాలను సాధించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని ఎన్‌సీసీ 3వ బాలికల బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ దుష్యంత్ కులశ్రేష్ఠ అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో వారం రోజులుగా నిర్వహించిన వార్షిక శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. అనంతరం ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 20 పాఠశాలల నుంచి సుమారు 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరు కాగా, వారిలో ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ ఏఎస్ఎన్ మూర్తి, ఏఎన్ఓ ఓలేటి స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



శ్యామల:	వారసుడు
సూర్యమినీ:	కళ్యాణం కమనీయం
సూర్యప్యాలెస్:	వీరసింహారెడ్డి
స్వామి:	వాల్తేరు వీరయ్య
శివజ్యోతి:	వాల్తేరు వీరయ్య
అనుశ్రీ:	వాల్తేరు వీరయ్య
రాజా:	వాల్తేరు వీరయ్య
కుమారి:	వీరసింహారెడ్డి
ఊర్వశి:	వీరసింహారెడ్డి
రంభ:	వారసుడు
మేనక:	తెగింపు
గీతాఅప్సర:	వాల్తేరు వీరయ్య
నామవరం:	
వీఎస్ మహల్:	వాల్తేరు వీరయ్య
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	వాల్తేరు వీరయ్య
కడియం:	
వెంకటసూర్య:	వాల్తేరు వీరయ్య

దరిచేరిన సుజలం..

- ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి
- నియోజకవర్గానికి జల్‌జీవన్ మిషన్ నిధులు
- రూ.46 కోట్లతో అభివృద్ధి పనులు


రాజంపేటలో సిద్ధమైన వాటర్ ట్యాంక్

సీతానగరం: జలం దరిచేరుతోంది.. ప్రజల దాహార్తి తీర్చుతుంది.. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంది.. ఈ పనులు ఇప్పటికే ప్రారంభం కాగా పలుచోట్ల పూర్తి కావొస్తున్నాయి. జల్‌జీవన్ మిషన్ పథకం నిధులతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. తాగునీటిని బయటకు వెళ్లి తెచ్చుకునే విధానానికి స్వస్తి పలుకుతూ నేరుగా ఇంటికే కుళాయి ద్వారా అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన పనులు సత్ఫలితాలను ఇస్తున్నాయి. తద్వారా రాజానగరం నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్య తీరనుంది. సీతానగరం మండలంలో రూ.16 కోట్లు, రాజానగరం మండలంలో రూ.16 కోట్లు, కోరుకొండ మండలంలో రూ.14 కోట్ల జల్‌జీవన్ మిషన్ నిధులు కేటాయించారు. వీటికి సంబంధించిన పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు 90 శాతం, మిగిలిన పది శాతం ప్రజల భాగస్వామ్యంతో ఇంటింటికీ కుళాయిలు వేసి, తాగునీటిని అందించనున్నారు. రాజానగరం మండలంలో 32 ఆవాస ప్రాంతాలు ఉండగా వాటిలో 28 చోట్ల పనులు జరుగుతున్నాయి. కోరుకొండ మండలంలో 24 ఆవాస ప్రాంతాలకు గాను అన్నిచోట్లా పనులు చేస్తున్నారు. సీతానగరం మండలంలో 33 చోట్లకు ప్రస్తుతానికి 13 చోట్ల పనులు జరుగుతుండగా చివర దశకు చేరుకున్నాయి. మరో నెల రోజుల్లో ప్రారంభోత్సవాలు జరుగనున్నాయి. వెదుళ్లపల్లి, మునికూడలి, రాజంపేట, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, ముగ్గళ్ల, నల్గొండ, పెదకొండేపూడి, చినకొండేపూడి, చీపురపల్లి, కాటవరం గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేశారు. రాపాకలో వాటర్ ట్యాంక్ ఉన్నందున పైప్‌లైన్లు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. నేరుగా ప్రతి ఇంటికి తాగునీటిని కుళాయిల ద్వారా అందించనున్నారు. అలాగే అవసరమైన గ్రామాల్లో బోర్లు ఏర్పాటు చేశారు. ఇవి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నాయి. మండలంలో మిగిలిన గ్రామాల్లో పనులు చేయడానికి టెండర్లు పిలుస్తున్నారు. ఇవి ఖరారైతే పనులు చేపట్టే అవకాశం ఉంది.

త్వరలోనే నీరు అందిస్తాం..

సీతానగరం మండలంలో 13 గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నాం. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా వాటర్ ట్యాంక్‌లను నిర్మించాం. పైప్‌లైన్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. త్వరలోనే తాగునీటిని అందించడానికి అన్నీ సిద్ధం చేస్తున్నాం.

–వి.అవినాష్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్